www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 8 జూన్ 2025
5
అన్నమయ్య



హజ్ యాత్రికులకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్ యాత్రకు వెళ్లిన యాత్రికులందరూ శుక్రవారం పవిత్ర అరాఫత్ మైదానంలో ప్రార్థనలు పూర్తిచేశారని, హజ్ యాత్రకు వెళ్లిన యాత్రికులందరికీ అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు హజ్ కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్‌ఖాన్ పేర్కొన్నారు. రాష్ట్రం నుండి పవిత్ర హజ్ యాత్రకు వెళ్లిన మొత్తం 1,618 మంది యాత్రికులు, పవిత్ర మక్కా నుండి బయలుదేరి, మీనా క్యాంపుకు, అక్కడి నుండి పవిత్ర అరాఫత్ మైదానానికి సురక్షితంగా చేరుకుని అరాఫత్ ప్రార్థనలు ఆధ్యాత్మిక వాతావరణంలో పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. శుక్రవారం రాత్రికి ముజ్దలిఫాలో బస చేసి, శనీవారం ఉదయం మీనా చేరుకొని తదుపరి హజ్ కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. హజ్ యాత్రలో మొత్తం కార్యక్రమాలలో హజ్ యాత్రికులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా ప్రభుత్వం తరపున సౌదీ అరేబియా-ఇండియన్ కౌన్సులేట్ జనరల్‌తో సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేయడం జరుగుచున్నదని తెలిపారు. ప్రస్తుత ఏడాది ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా ప్రభుత్వం నియమించిన రాష్ట్ర హజ్ ఇన్‌స్పెక్టర్లు, హాజీలతో అనుసంధానం చేయడం వలన హజ్ యాత్రికులకు సౌలభ్యంగా మారిందని పఠాన్ ఖాదర్ ఖాన్ వెల్లడించారు.

టిడిపికి 'సుగవాసి' రాజీనామా

ప్రజాశక్తి-రాయచోటి/రాజంపేట అర్బన్



జిల్లా తెలుగుదేశం పార్టీలో పెనుపరిణామాలు చోటు చేసుకున్నాయి. రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు తనయుడు సుగవాసి బాలసుబ్రమణ్యం శనివారం తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తూ లేఖను అధినేత చంద్రబాబుకు పంపించారు. ప్రజలు, పాలకొండ్రాయుడు అభిమానుల సలహాలు, సూచనలు, అభిప్రాయాల మేరకు వారి మనోభావాలను గౌరవిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కట్టె కాలే వరకూ పార్టీని వదలనని శపథం చేసిన పాలకొండ్రాయుడు ఇచ్చిన మాట ప్రకారం తుదిశ్వాస విడిచేవరకూ పార్టీ కోసమే పనిచేశారు. తాజా రాజకీయ పరిణామాలతో సుగవాసి కుటుంబానికి తెలుగుదేశం పార్టీలో అధిష్టానం తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో నమ్ముకున్న అభిమానుల కోసం పార్టీ వీడుతున్నట్లు ప్రకటించారు. 2024 ఎన్నికలలో నారా చంద్రబాబునాయుడు సుగవాసి బాలసుబ్రమణ్యంను మొదటగా రాజంపేట ఎంపీ అభ్యర్థిగా ప్రకటించి అనంతరం కూటమి పొత్తుల్లో భాగంగా రాయచోటి నియోజకవర్గంలో కాకుండా రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించారు. అది కూడా కేవలం ఎన్నికలకు కొన్ని రోజులు ముందే అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ అధిష్టానం నిర్ణయాన్ని శిరోధార్యంగా భావించి బాలసుబ్రమణ్యం ఎన్నికల బరిలో దిగారు. స్థానికేతరుడు కావడం, స్వల్ప సమయంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులను, కార్యకర్తలను కలుపుకొని పోవడంలో సమయాభావం వలన స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. ఓటమిపాలైనప్పటికీ రాజంపేట నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలైన అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణం, రాజంపేట జిల్లా కేంద్రం, వైద్య కళాశాల వంటి తదితర ప్రధాన సమస్యలపై ఎప్పటికప్పుడు అధిష్టానం దృష్టికి తీసుకెళ్తూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడేందుకు కృషి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలకొండ్రాయుడి కుటుంబానికి తగినంత ప్రాధాన్యత ఇవ్వలేదనే సుబ్రహ్మణ్యం అసంతృప్తిగా ఉన్నారు. రాయచోటి పర్యటనలో సైతం ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ఇన్‌ఛార్జి వ్యవహారంలోనూ మొండిచేయి చూపడంతో పాటు ఇటీవల స్వర్గస్తులైన పాలకొండ్రాయుడికి చంద్రబాబు నివాళి అర్పించకపోవడం, కుటుంబాన్ని పరామర్శించకపోవడం, కడప నగరంలో జరిగిన మూడు రోజులు మహానాడులో సైతం పాలకొండ్రాయుడి ప్రస్తావన కూడా తేకపోవడం వంటి తదితర కారణాలతోనూ.. తరచూ అవమానాలకు గురవుతున్నా పార్టీలోనే కొనసాగుతూ వచ్చిన పాలకొండరాయుడు కుటుంబం ప్రాధాన్యత ఇవ్వని పార్టీలో కొనసాగడం కంటే రాజీనామా చేయడమే ఉత్తమమని అభిమానుల సూచనల మేరకు బాలసుబ్రమణ్యం సోదరులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చంద్రబాబుతో సమకాలీన రాజకీయాలు చేసిన పాలకొండ్రాయుడు ఆరోగ్యం సహకరించకపోయినా గడిచిన ఎన్నికల్లో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గెలుపు కోసం వీల్ చైర్‌లోనే ప్రచారం చేశారని, తెలుగుదేశం పార్టీకి ఇంత విధేయులుగా ఉన్న వీరి కుటుంబాన్ని చంద్రబాబు నాయుడు నిర్లక్ష్యం చేయడం వల్లనే వారు పార్టీ వీడినట్లు వారి అభిమానులు చర్చించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- డిటిసి కార్యాలయం ఆకస్మిక తనిఖీలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి

ప్రజాశక్తి-కడప

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప పట్టణంలోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా శాఖ అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు ప్రజలకు ట్రాఫిక్ రూల్స్ గురించి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని, రోడ్డు ప్రమాదాల మూలంగా ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు భద్రత కమిటీలోని ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పని చేసి ప్రమాదాలను పూర్తిగా అరికట్టాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం కార్యాలయపు సిబ్బందితో మాట్లాడి మీకు ఎలాంటి సమస్యలున్న వెంటనే తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చు అని వారికి తెలిపారు.

ప్రజాదర్బార్‌తో ప్రజా సమస్యలకు పరిష్కారం

చిన్నమండెం : ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నో ఏళ్లుగా రాయచోటి నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. జిల్లాలో ఎక్కువగా గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, భూ కబ్జాలు మీద అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని వీటిపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలు స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు.



కడప ఆర్‌టిఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మీను శుక్ల పాఠక్

ప్రజాశక్తి-రాయచోటి

జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందేలా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని మీను శుక్ల పాఠక్ పేర్కొన్నారు. శనివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సహాయంతో చేపడుతున్న జల జీవన్ మిషన్ పథకంపై కేంద్ర ప్రభుత్వం తరపున వచ్చిన ప్రతినిధులైన మీను శుక్ల పాఠక్, ఎస్‌పి శెట్టి, చీఫ్ ఇంజినీర్ (హర్యానా రాష్ట్ర ప్రభుత్వం), గ్రామీణ నీటి సరఫరా శాఖ, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల డిఆర్‌డిఎ, డ్వామా, పిడిడిఆర్‌ఎ, పంచాయతీరాజ్, తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారి ప్రసన్నకుమార్, జల జీవన్ మిషన్ ప్రాజెక్టులో భాగంగా 3,709 పనులు మంజూరు అయ్యాయని ఇందులో 2225 పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులు వివిధ దశలలో ఉన్నాయని చెప్పారు. జిల్లాలోని 438 గ్రామాలలో ప్రతి గ్రామంలో నీటి నాణ్యత పరీక్ష ప్రయోగశాలలు ఉన్నాయన్నారు. జలజీవన్ మిషన్‌లో ప్రాజెక్టుల పర్యవేక్షణ కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ కమిటీలను కలెక్టర్ ఏర్పాటు చేశారన్నారు. అన్నమయ్య, చిత్తూరు జిల్లాలలోని మొత్తం 44 మండలాలలోని 6,967 నివాసాలలో నివసిస్తున్న 31 లక్షల 87 వేల 66 మందికి రెండు ఫేసులలో గండికోట, వెలిగల్లు రిజర్వాయర్ల ద్వారా కరువు ప్రాంతాలకు తాగునీటిని అందించడం కోసం రూ. 2370 కోట్లతో ఏప్రిల్ 2025 లో ప్రారంభించిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు అక్టోబర్ 2027 కల్లా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ప్రాజెక్టు మొదటి ఫేసులో పీలేరు, తంబళ్లపల్లి, రాయచోటిలోని మొత్తం 18 మండలాలలో 241 గ్రామపంచాయతీలకు నీటి సరఫరా అందించబడుతుందన్నారు. మొదటి ఫేసులో గండికోట రిజర్వాయర్ ద్వారా 1.683 టిఎంసిల నీటిని, రాయచోటి, వెలిగల్లు రిజర్వాయర్ ద్వారా 0.175 టిఎంసి నీటిని కరువు ప్రాంతాలకు అందించబడతాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా భౌగోళిక స్వరూపం వల్ల వర్షపాతం తక్కువగా ఉంటుందని, భూగర్భ జలాలు ప్రజలందరికీ అందుబాటులో లేవని జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి నీటి సరఫరా అత్యంత అవసరమని కేంద్ర ప్రభుత్వ బృందానికి వివరించారు. కేంద్ర ప్రభుత్వ బృందం వారు సూచించిన విధంగా ప్రాజెక్టు పనులను గడువులోగా పూర్తి చేసి ప్రజలందరికీ ముఖ్యంగా కరువు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు మంచినీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం

- డిసిసిబి చైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డి
- డిసిఎంఎస్ చైర్మన్‌గా జయప్రకాష్
- హాజరైన మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు



డిసిసిబి చైర్మన్, డిసిఎంఎస్ చైర్మన్లుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సూర్యనారాయణరెడ్డి, జయప్రకాష్

ప్రజాశక్తి-కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా ఉమ్మడి కడప జిల్లాకు చెందిన బద్వేల్, రైల్వేకోడూరుకు చెందిన నాయకులకు డిసిసిబి, డిసిఎంఎస్ చైర్మన్ పదవులు దక్కాయి. శనివారం నగరంలోని మాధవి కన్వెన్షన్‌లో డిసిసిబి చైర్మన్‌గా మంచూరు సూర్యనారాయణరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్‌గా యర్రగండ్ల జయప్రకాష్ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఆయనతోపాటు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టిడిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమర్తి జగనమోహన్‌రాజు విచ్చేశారు. ఈ సందర్భంగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసేవారికి, సీనియారిటీ ఆధారంగా జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పదవులు ఇస్తారని తెలిపారు. పార్టీలోకి వచ్చిన వెంటనే పదవులు ఇవ్వరన్నాని స్పష్టం చేశారు. కష్టపడిని వారికి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. చైర్మన్ పదవులు బద్వేల్, రైల్వే కోడూరు నియోజకవర్గాలకు చెందిన నాయకులకు ఇచ్చారని చెప్పారు. పదవులు పొందిన వారు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని కోరారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని, సూపర్ సిక్స్ అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం పొందిన చైర్మన్ పదవులు రైతులకు సంబంధించినవని చెప్పారు. రైతులకు కావాల్సిన రుణాలు మంజురు చేయాలని కోరారు. తక్కువ వడ్డీరేటుతో రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు. చైర్మన్లకు కావాల్సిన సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కార్యకర్తల సేవలను గుర్తించి పదవులు ఇచ్చారని చెప్పారు. కడప నియోజకవర్గంలో కార్యకర్తలు బాగాపని చేసి పదవులు పొందాలని పిలుపు నిచ్చారు. ప్రజలకు సేవ చేయాలని పేర్కొన్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ రైతులను వెన్నుండి నడపాలని కోరారు. మామిడి రైతుల సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపి కోసం నిరంతరం పని చేశారని చెప్పారు. డిసిసి, డిసిఎంఎస్ ఆస్తులను కాపాడాలని పేర్కొన్నారు. తక్కువ ధరలకే ఎరువులు అమ్మాలని కోరారు. చైర్మన్‌లు సూర్యనారాయణరెడ్డి, జయప్రకాష్ మాట్లాడుతూ పదవులు ఇచ్చిన చంద్రబాబు, లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నాయకులు విజయమ్మ, రితేష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు తెలిపారు. రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. సకాలంలో రుణాలు, ఎరువులు, విత్తనాలు, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళతామని పేర్కొన్నారు. డిసిసి బ్యాంక్ అభివృద్ధే తమ ధ్యేయమని చెప్పారు. డిసిసి, బిసిఎంఎస్‌లను అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు.బద్వేల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి మాట్లాడుతూ వీరారెడ్డిపై నమ్మకం ఉంచి తమతో నడుస్తున్నారని చెప్పారు. మెట్టరైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు తెలియకుండానే రుణాలు తీసుకున్నారని తెలిపారు. వీరిని రికవరీ చేసి తీరుతామని బద్వేల్ సొసైటీల విచారణ పూర్తయిందని చెప్పారు. ఐదేళ్లల్లో రైతులు బాగా నష్టపోయారన్నారు. డిసిసి బ్యాంక్ రుణాలు అందించడంలో కడప బ్యాంక్ వెనుకబడి ఉందని పేర్కొన్నారు. బ్రహ్మం సాగర్ నీటితో బద్వేల్‌లో చెరువులను నింపాలని కోరారు. సభలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, ముక్కా రూపానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి

చేనేత కార్మికుడి నిర్బంధం

దాడి చేసి చితకబాదిన ఫైనాన్షియర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



దాడిలో గాయపడిన అరవింద్

మదనపల్లె పట్టణంలో ఓ ఫైనాన్షియర్ రెచ్చిపోయాడు. వారం కంతుకు తీసుకున్న డబ్బు సక్రమంగా చెల్లించలేదని నేతన్నను కిడ్నాప్ చేసి బలవంతంగా రూమ్‌కు తీసుకెళ్లారు. గదిలో రాత్రంతా నిర్బంధించి కర్రలు, బెల్టులతో మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. వేకువ జామున వదిలి పెట్టడంతో బాధితుడు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స పొందుతున్నాడు. శనివారం వెలుగు చూసిన ఘటనపై బాధితుడు మీడియాకు తెలిపిన వివరాల మేరకు.. తంబళ్లపల్లె నియోజకవర్గం, కురబలకోట మండలం, సర్కారుతోపు సమీపంలోని చింతమాకులపల్లెకు చెందిన కడతలమర్రి అరవింద్ మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లిలోని రామిరెడ్డి లేఅవుట్‌లో అద్దె ఇంట్లో ఉంటూ, కూలి మగ్గాలు నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అదే ప్రాంతంలో కాపురం ఉంటున్న ఫైనాన్షియర్ శ్రీరామ్ ప్రసాద్ దగ్గర రూ.10 వేలు వారం కంతుకు తీసుకున్నాడు. కంతులు చెల్లించడంలో ఆలస్యమైందని ఫైనాన్షియర్ శ్రీరామ్ ప్రసాద్ తన అనుచరులైన శివ, రెడ్డిలను వెంట తీసుకెళ్లి అరవింద్‌ను మగ్గాల రూమ్ నుంచి కిడ్నాప్ చేశారు. అదే ప్రాంతంలో దూరంగా ఉన్న రాజానగర్‌కు ఎత్తుకెళ్లి ఓ ఇంటి మిద్దె పైనున్న గదికి తీసుకెళ్లి రాత్రంతా అక్కడే నిర్బంధించారు. బెల్టు, రాడ్లతో చితకబాది తీవ్రంగా గాయపరిచారు. వేకువ జామున వదిలి పెట్టడంతో బాధితుడు అష్టకష్టాలపై మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చికిత్సలు పొందాడు. సమాచారం అందుకున్న ఒకటవ పట్టణ పోలీసులు బాదితున్ని విచారించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సౌత్ జోన్ వన్డే క్రికెట్ టోర్నీ విజేత అనంతపురం

- నాలుగో స్థానంలో కడప జట్టు

ప్రజాశక్తి - కడప: కడపలోని ఎసిఎ స్టేడియం, కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానాలలో లీగ్ పద్ధతిలో నిర్వహించిన ఎసిఎ సౌత్ జోన్ అండర్-23 వన్డే క్రికెట్ టోర్నమెంట్ విజేతగా అనంతపురం జట్టు నిలిచింది. రెండవ స్థానంలో నెల్లూరు జట్టు, మూడవ స్థానంలో చిత్తూరు జట్టు నిలిచాయి. నాలుగవ స్థానంలో కడప జట్టు నిలువగా చివరి స్థానంలో కర్నూలు జట్టు నిలిచింది. లీగ్ పద్ధతిలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో సౌత్ జోన్‌కు చెందిన కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం జట్లు పాల్గొన్నాయి. అనంతపురం జట్టు మొత్తం నాలుగు మ్యాచ్‌లు ఆడి అందులో మూడు మ్యాచ్‌లు గెలిచి 1.768 నెట్ రన్ రేట్ సాధించి మొదటి స్థానంలో నిలిచి టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచింది. నెల్లూరు జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడి అందులో మూడు మ్యాచ్‌లలో విజయం సాధించి 1.105 నెట్ రన్ రేట్ సాధించి రెండవ స్థానంలో నిలిచింది. చిత్తూరు జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడి అందులో మూడు మ్యాచ్‌లు గెలిచి 0.610 నెట్ రన్ రేట్ సాధించి మూడవ స్థానంలో నిలిచింది. కడప జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడి అందులో ఒక మ్యాచ్ గెలిచి - 0.669 నెట్ రన్ రేట్‌తో నాల్గవ స్థానంలో నిలిచింది. కర్నూలు జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడి అందులో ఏ ఒక్క మ్యాచ్ కూడా గెలువకపోవడంతో - 2.705 నెట్ రన్ రేట్‌తో చివరి స్థానంలో నిలిచింది.

ఆరు వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు విజయం: కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన చివరి లీగ్ మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై చిత్తూరు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 44.4 ఓవర్లలో 208 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతరం 209 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 23.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఎసిఎ స్టేడియంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో కడప జట్టు 35.2 ఓవర్లలో 151 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతరం 152 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన అనంతపురం జట్టు 22.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.



వన్డే క్రికెట్ టోర్నీ విజేత అనంతపురం జట్టు క్రీడాకారులు



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఖనిజ సంపద దోపిడీ కోసమే ఆపరేషన్ కగార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆపరేషన్ కఘార్ ను వెంటనే ఆపాలని సిపిఐ మదనపల్లి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎస్టియు కార్యాలయంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఈసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.టి.ఎం శివ ప్రసాద్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమల సుదర్శన్, సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు, శాంతి సంఘీభావం రాష్ట్ర ప్రచార కార్యదర్శి జివి శివకుమార్, ఏపీసీఎల్సి నాయకులు నాగేశ్వరరావు, ఐలు నాయకులు న్యాయవాది సోమశేఖర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం శత్రుదేశాలతో నరహంతకులైన ఉగ్రవాదంతో చర్చలు జరుపుతుందని,ఈ దేశంలో మౌలిక సమస్యలు పరిష్కారం చేయాలని పేదరిక నిర్మూలన దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న మావోయిస్టులపైన ఆపరేషన్ కఘార్ ప్రారంభించడం సరైనది కాదన్నారు. శాంతి చర్చలు జరపాలని ప్రభుత్వానికి మావోయిస్టులు ఇప్పటికే నాలుగు లేఖలు రాసిన, కేంద్ర ప్రభుత్వం చర్చలకు నిరాకరిస్తుందన్నారు. కాల్పుల్లో చనిపోయిన మావోయిస్టుల శవాలను కూడా తన బంధువులకి ఇవ్వకుండా అతి కిరాతకంగా వ్యవహరిస్తుందని, కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 25 పైన దాడి చేస్తుందని, వ్యక్తి స్వేచ్ఛను హరిస్తుందన్నారు. ప్రభుత్వం విప్లవకారులని చంపగలరేమో కానీ విప్లవాన్ని చంపలేరాన్నారు. శాంతి చర్చలతోనే సమస్యను పరిష్కారం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 12వ తేదీ మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆపరేషన్ కఘార్ ను ఆపాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క ృష?ప్ప, నియోజకవర్గం మురళి, విసికే పార్టీ, మాల మహానాడు, బహుజనసేన నాయకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని గురబలకోట ఎంపిడిఒ గంగయ్య అన్నారు. కురబలకోటలోని శాఖా గ్రంథాలయ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించారు. బాలల దిశగా పఠనశక్తిని అభివృద్ధి చేయడం, విజ్ఞాన వికాసం కల్పించడం ముఖ్య ఉద్దేశ్యంగా ఈ క్యాంప్ నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరంలో విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్, రీడింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, యోగా, స్వర్ణాంధ్రప్రదేశ్-2047 నేపథ్యంలో సాధారణ జ్ఞానం, మ్యూజికల్ చైర్స్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వబడింది. ఈ కార్యక్రమం మొత్తం 40 రోజుల పాటు సాగింది. శిబిరం ముగింపు వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరైన కురబలకోట ఎంపిడిఒ గంగయ్య, పంచాయతీ కార్యదర్శి శేషగిరిరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రాఫ్ట్ టీచర్ నాగమణి, గ్రంథాలయ అధికారి బి.చంద్రశేఖర్ నాయక్ హాజరయ్యారు. విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన సచివాలయ సిబ్బంది మల్లికార్జున, రిసోర్స్ పర్సన్ వల్లి, గ్రంథాలయ సిబ్బంది పద్మావతమ్మ సేవలను నిర్వాహకులు కొనియాడారు.

రాజ్యాంగ పదవి రావడం హర్షణీయం

- బిసి నాయకులు బుస్సా నాగరాజ గౌడ్

ప్రజాశక్తి-పీలేరు

ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో ఓ బిసి వ్యక్తి, తమ శ్రేయోభిలాషి పురం రామ్మూర్తికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా రాజ్యాంగ పదవి రావడం తమకు చాలా సంతోషంగా ఉందని చిత్తూరు పార్లమెంట్ టిడిపి ఈడిగ బిసి సాధికార సమితి అధ్యక్షులు బుస్సా నాగరాజ గౌడ్, చిత్తూరు జిల్లా గౌడ సంఘం ఉపాధ్యక్షులు యాలపల్లి ధీనదయాళ్, చిత్తూరు జిల్లా గౌడ సంఘం యువసేన ప్రధాన కార్యదర్శి వేపాకుల మురళీ గౌడ్, పూతలపట్టు గౌడ సంఘం నాయకులు తుమ్మల నాగరాజ గౌడ్ పేర్కొన్నారు. శనివారం వారు పీలేరులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తిని తన కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా బుస్సా నాగరాజ గౌడ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ రథసారథి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి తమ సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో తమ శ్రేయోభిలాషి పురం రామ్మూర్తి మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఉన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న బిసి సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అయోమయం

ప్రజాదృష్టి

ఉపాధ్యాయ బదిలీల్లో అయోమయం నెలకొంది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఇష్టానుసారంగా వ్యవరిస్తుండడమే కారణమని తెలుస్తోంది. జిల్లాలో సుమారు 6,500 మంది ఉపాధ్యాయులను బదిలీలు చేయాల్సి ఉంది. వీరందరూ ఐదేళ్లు, ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసి ఉన్నారు. చైతన్యవంతులను ఉపాధ్యాయ లోకాన్ని బదిలీలు చేయడమంటే కత్తిమీద సామును తలపించడమే అవుతుంది. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఉపాధ్యాయులు ఉండడం, చైతన్యం పాలు ఎక్కువగా ఉండడం తెలిసిందే. పలు ఉపాధ్యాయ సంఘాలు సైతం క్రియాశీలంగా వ్యవహరిస్తుండడంవంటి కారణాల రీత్యా ఉపాధ్యాయుల బదిలీలు చేయడం సవాలుతో కూడుకున్న వ్యవహారంగా పేర్కొనవచ్చు. ఉపాధ్యాయుల బదిలీలపై పాఠశాల విద్యా శాఖ తీవ్రంగా కసరత్తు చేయాలి. ప్రస్తుత బదిలీలను పరిశీలిస్తే సీరియస్‌గా కసరత్తు చేసిన దాఖలాలు కనిపించడం లేదనే వాదన వినిపిస్తోంది. ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకున్న ఆప్షన్ల ప్రకారం బదిలీలు ఉండకపోవడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది. ఎంపిక చేసుకున్న ఆప్షన్లను కాదని ఇతర ప్రాంతాలకు బదిలీలు చేయడం ఏమిటని, మరి అలాంటప్పుడు ఆప్షన్లు ఇవ్వడంలో అర్థమేమిటనే ప్రశ్న వినిపిస్తోంది. కొందరి ఆప్షన్లు రిజర్వ్‌లో ఉంచడంలో దాగి ఉన్న పరమార్థమేమిటో తెలియడం లేదనే వాదన ఉపాధ్యాయ సంఘాల నుంచి వినిపిస్తుండడం గమనార్హం. స్పౌజ్ బదిలీల్లోనూ గందరగోళం నెలకొంది. భార్యాభర్తలు సమీప పాఠశాలలు, ఒకే పాఠశాలల్లో పనిచేయడానికి ఉద్దేశించిన స్పౌజ్ ఉద్యోగులను ఇతర ప్రాంతాల్లోని పాఠశాలలకు బదిలీ చేయడం ఏమిటనే వాదన వినిపిస్తోంది. సర్ ప్లస్ ఉపాధ్యాయుల పరిస్థితి అయోమయంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని సిపిడబ్ల్యు స్కీముల టెండర్ల ఓపెన్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి కడప జిల్లాలోని 25 సిపిడబ్ల్యు స్కీముల టెండర్ల ఓపెన్ వ్యవహారంలో పారదర్శకత కొరవడింది. ఉదాహరణకు లక్కిరెడ్డిపల్లి, మాధవరం, కొత్తమాధవరం స్కీముల టెండర్ల వ్యవహారం గందరగోళాన్ని సృష్టించింది. లక్కిరెడ్డిపల్లి స్కీముటెండర్ ఓపెనింగ్, ఎఎస్‌డి చెల్లింపుల్లో రాజీపడడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించిందని చెప్పవచ్చు. సిపిడబ్ల్యు స్కీముల టెండర్లకు పోటీ పెరిగిన కారణంగా ఎక్కువ లెస్‌కు వేయడాన్ని నిరోధించాలనే ఉద్దేశంతో ఎఎస్‌డి నిబంధన అమలులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. అమలు చేయడంలో అయిన వారికి ఆకుల్లో..కానివారికి కంచాల్లో పెట్టడమనే సామెతను తలపిస్తోంది. ఆర్‌డబ్ల్యుఎస్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి, కాంట్రాక్టర్లతో కుమ్మక్కు కావడానికి ఎఎస్‌డి నిబంధ నను వాడుకోవడం జుగుప్సాకరమని గ్రహించాలి. కీలక సమస్యలపై కలెక్టర్, కమిషనర్ స్థాయి వంటి ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్ప వచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి


గాలివీడు నుంచి కోటకాడపల్లి వరకు వేస్తున్న రోడ్డు

రూ.7 కోట్లతో తారురోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-గాలివీడు

మండలానికి రెండు తారు రోడ్లు మంజూరయ్యాయి. స్థానిక బస్టాండ్ నుంచి కోటకాడపల్లి వరకు 8 కిలోమీటర్ల తారు రోడ్డును రూ.7కోట్ల వ్యయంతో నిర్మాణం కొనసాగుతున్నది. గుండ్ల చెరువు నుంచి కమలమర్రి వరకు ఎనిమిది కిలోమీటర్లు తారు రోడ్డు రూ.3కోట్ల వ్యయంతో రోడ్డు ఫార్మేషన్ పూర్తయింది. ఆ రోడ్డు పనులను టెండర్‌దారుడు మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. కోటకాడపల్లి తారురోడ్డు నిర్మాణంతో గాలివీడు, ప్యారం పల్లి, గరుగుపల్లి, పందికుంట, తలముడిపి, కొర్లకుంట, మీదుగా గండి వేంపల్లి పోయే అవకాశం లభించిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాల నుంచి వెనుకబడిపోయిన రోడ్డును ముందుకు తీసుకు రావడం ద్వారా గ్రామాలకు మెరుగు లభించిందని అన్నారు. మెయిన్ రోడ్డుపై కాకుండా ఇలా గ్రామాలలో బైపాస్ రోడ్డుగా ఆ గ్రామ ప్రజలందరికీ అనుకూలంగా రోడ్డు నిర్మాణం చేపట్టడం వలన రాకపోకలకు సులువుగా మారాయని పేర్కొన్నారు.

'ఉపాధి' కూలీలకు బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని చాగలపల్లి, కుమ్మరపల్లి, ఎగువమాలపల్లి ఉపాధి కూలీలను బిల్లులు మంజూరు చేయాలని కూలీలు వేడుకున్నారు. గత మూడు వారాల నుంచి మండుటెండల్లోనే పనులు చేశామని తెలిపారు. ఉపాధి కూలీలకు తాగునీరు, మజ్జిగ కూడా ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారం వారం బిల్లులు ఇవ్వాలని లేకుండా కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మండల అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కూలీలకు బిల్లులు మంజూరు చేయాలని వారు కోరారు.


శ్రీనివాసరాజును సన్మానిస్తున్న గ్రామస్తులు

అంకాలమ్మ సన్నిధిలో 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : మండల పరిధిలోని ఊటుకూరు అంకాలమ్మ జాతరకు గ్రామస్తుల ఆహ్వానం మేరకు శనివారం జనసేన పార్లమెంట్ అధ్యక్షులు యల్లటూరు శ్రీనివాసరాజు జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యల్లటూరుకు యువత బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. బాణాసంచా పేలుస్తూ గజమాలతో సత్కరించారు.అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులందరికీ శ్రీనివాసరాజు అన్న ప్రసాదం స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.


రెడ్డి రాహిత్యకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రతిభ అవార్డు గ్రహీతకు అభినందనలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 596/600 మార్కులు సాధించిన రాజు స్కూల్ విద్యార్థిని ఇండ్లూరి రెడ్డిరాహిత్యను కరస్పాండెంట్ చమర్తి జగన్మోహన్‌రాజు అభినందించారు. స్థానిక రాజు హైస్కూల్లో శనివారం ప్రిన్సిపల్ వి.మోహన్‌రెడ్డితో కలిసి రెడ్డి రాహిత్యకు ప్రశంసా పత్రం, షీల్డ్‌ను అందించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులు విద్యపై మక్కువతో విద్యను అభ్యసించాలని కోరారు. తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులకు ప్రతిభ అవార్డులు రావడం గర్వకారణంగా ఉందన్నారు. క్రమశిక్షణ కలిగిన విద్యను అందించడం తమ కళాశాలల ప్రత్యేకతని తెలిపారు.

ఉపాధ్యాయురాలికి ఘన నివాళి

ప్రజాశక్తి-రామాపురం : సికెదిన్నె మండలంలోని బుగ్గలేటిపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు రాణికుమారి అంత్యక్రియలకు రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుమారుడు నిశ్చల్ నాగిరెడ్డి హాజరై నివాళులర్పించారు. మండలంలోని కల్పనాయుని చెరువు పంచాయతీ అగ్రహారంలో శనివారం ఆమె మృతదేహాన్ని తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపారు. నాగిరెడ్డి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం రమేష్ రెడ్డి, నీలకంఠరావుపేట ఉప సర్పంచ్ మహబూబ్‌బాషా, టిడిపి నాయకులు సహదేవరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - వేంపల్లె : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వేంపల్లి సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు పేర్కొన్నారు. పది రోజులుగా స్థానిక జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శనివారంతో ముగిశాయి. చివరగా ఫైనల్లో నందిమండలం టీంతో వేంపల్లి టీంలు తల పడ్డా యి. నందిమండలం టీం విన్నర్‌గా.. వేంపల్లి టీం రన్నర్‌గా నిలిచాయి. విజే తలకు సర్పంచ్ బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ. 20వేలతోపాటు షీల్డ్ అందజేశారు. రెండవ బహుమతి రూ.15వేలు సర్పంచ్ ఆర్.శ్రీనువాసులు అందజేశారు. కార్యక్ర మంలో వైసిపి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి కాశిరెడ్డి ఆదినారాయణ, రాష్ట్ర సంయుక్త

నాలుగు రోడ్ల కూడలిలో మళ్లీ ఆక్రమణలు

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణంలోని స్థానిక గేటు వద్ద కోనంపేటకు వెళ్లే నాలుగురోడ్ల కూడలిలో గతంలో రోడ్డును ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా రోడ్డుపైనే బండ్లు, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు.స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి రోడ్డు ఆక్రమించి ఉన్న షెడ్లను, దుకాణాలను, బంకులను ధ్వంసం చేసి చదును చేయించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్డుపై దుకాణా సముదాయాలను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరల తిరిగి పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశాలను బేఖాతరు చేసి బ్రాందీషాప్ పక్కన రేకుల షెడ్ ఏర్పాటు చేసి విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఇలా ఒకటి తర్వాత మరొకటి ఏర్పాటై రోడ్డు ఆక్రమణకు గురై ట్రాఫిక్ సమస్య తీవ్ర తరమవుతుందని ప్రజల వాపోతున్నారు. ఇప్పటికే ఆక్రమించి ఎన్నో సంవత్సరాల నుంచి గృహాలు నిర్మించుకున్నారు. పట్టణంలో ఎక్కడ స్థలాలు కూడా లేకపోవడంతో ఉన్న స్థలంలోనే వ్యాపారస్తులు అనుకూలంగా షెడ్డులు ఏర్పాటు చేసుకుంటున్నారు.


రోడ్డుపై నిర్మించిన షెడ్డు

ఇప్పటికైనా అధికారులు దృష్టిపెట్టి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు


మదనపల్లి : బక్రీద్ ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భక్తిశ్రద్ధల మధ్య బక్రీద్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని వేలాది మంది ముస్లిం మైనార్టీ సోదరులు స్థానిక బెంగళూరు రోడ్డులోని ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, హజ్ కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్‌ఖాన్, మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డిసాహెబ్, మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా పాల్గొన్నారు.ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ ఇస్లాం ప్రవక్త ఆదేశాల మేరకు బక్రీద్ పండుగ జరుపుకుంటామని, ఈ పండగ సందర్భంగా ముస్లిం సోదరులు ఖుర్బానీని మూడు భాగాలుగా చేసి ఒక భాగం తమకు, మరో భాగాన్ని బంధువులకు, ఇంకో భాగాన్ని పేదలకు పంచిపెట్టి అందరూ సమానంగా వేడుకగా ఈ పండుగను జరుపుకుంటామని తెలిపారు. **నిమ్మనపల్లి:** మండల పరిధిలో నిమ్మనపల్లి, కొండయ్యగారిపల్లె, సైదాపేట, రాచవేటి వారిపల్లె, చౌకిళ్ళవారిపల్లె, ముష్టూరు, చల్లవారిపల్లె, సింగంవారిపల్లె, కలిబండవారిపల్లె, తురకపల్లె తదితర గ్రామాల్లో పండుగను భక్తిశ్రద్ధలతో జరు పుకున్నారు. ఉదయం ఊరేగింపుగా మసీదులు, ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిమ్మనపల్లెలోని జామియానా, అబూఅనీఫా మసీదులలో, చల్లావారిపల్లె నురానా మసీదులో ముత్తవల్లీల ప్రత్యేక ప్రార్థనల అనంతరం ధార్మికో ఉపన్యాసం చేశారు. **పీలేరు:** పట్టణంలోని అన్ని మసీదుల నుంచి ముస్లిం సోదరులు స్థానిక జెండామాను దగ్గరకు చేరుకుని, అక్కడి నుంచి సామూహికంగా ఈద్గా మైదానం చేరుకుని, పండుగ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. జనం పరమత సహనంతో సాటి వ్యక్తుల పట్ల ప్రేమ, ఆప్యాయతలు కలిగి ఉండేలా చూడాలని దువా చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ప్రతిఒక్కరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పీలేరు పట్టణ సిఐ యుగంధర్ పర్యవేక్షణలో ఎస్ఐ, సిబ్బంది ఈద్గాతోపాటు పట్టణంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా వాహనాల రాక పోకలను కూడా నియంత్రించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.మండలంలోని తలుపుల, జాండ్ల, బాలంవారిపల్లి, రేగళ్ల, ఒంటిల్లు మొదలగు గ్రామాల్లో ముస్లిములు బక్రీదు ప్రత్యేక ప్రార్థనలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకుని ఒకరికిమరొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. **నందలూరు:** బక్రీద్ పండుగను అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు. నాగిరెడ్డిపల్లి గ్రామ జామియా మసీద్ ప్రాంగణంలో ఉన్న ఈద్గా నందు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలతో ఈ సద్దులతో ప్రారంభమై ప్రత్యేక ప్రార్థనలతో ముగిసినది. అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **రామాపురం :** మండలంలోని ముస్లిం మైనార్టీ సోదరులు బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గువ్వలచెరువు, నీలకంఠరావుపేట, ఉడుము వారిపల్లి, రామాపురం, హసనాపురం, పకీరుపల్లి, ఏకిలపల్లిలో ముస్లిం సోదరులు ఈద్గాల వద్దకు వెళ్లి ఘనంగా ప్రార్థనలు చేశారు. బక్రీద్ త్యాగానికి ,దాతృతానికి ప్రతిగా అల్లా నేర్పడని మత గురువులు ముస్లిం సోదరులకు ప్రబోధించారు. **బి.కొత్తకోట:**పట్టణంలోని అన్ని మసీదుల నుంచి ముస్లిము సోదరులు స్థానిక జెండామాను దగ్గరకు చేరుకుని, అక్కడి నుంచి సామూహికంగా అల్లాను స్తుతిస్తూ పెద్దతిప్పసముద్రం రోడ్డు మార్గంలోని ఈద్గా మైదానం చేరుకుని, పండుగ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ప్రతిఒక్కరూ ఒకరినొకరు ఆలిం గనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ అరిఫ్, సంపత్‌కోట మహమ్మద్ సాదిక్, అహ్మద్‌బాషా, ఖాదర్ బాషా, మియా, జాఫర్, స్వాతి జిరాక్స్ సెంటర్ చాంద్‌బాషా, జిఎం, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, ఎస్ఎస్ ఫయాజ్, అయూబ్‌బాషా, జి.చాంద్‌బాషా పాల్గొన్నారు.


నిమ్మనపల్లి : సాముహిక ప్రార్థనల్లో ముస్లిము సోదరులు

డిసిసి, డిసిఎంఎస్ చైర్మన్లను అభినందించిన 'చమర్తి'


డిసిసి చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాష్‌ను సన్మానిస్తున్న చమర్తి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడపలోని మాధవి కన్వెన్షన్‌లో శనివారం జరిగిన డిసిసి, డిసిఎంఎస్ చైర్మన్ల ప్రమాణస్వీకారానికి రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు హజరయ్యారు. నూతన డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారా యణరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్‌ను దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం చమర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలోనే 70 శాతం సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందని, అన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి కులమతాలకతీతంగా పదవులు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక ఆదాయం

ప్రజాశక్తి-రామాపురం

పంట సాగులో సకాలంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక ఆదాయం పొందవచ్చని కడప కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శిల్ప కళ, సూచించారు. శనివారం వెంకటరెడ్డిగారిపల్లి గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా రైతులకు పండ్ల తోటల పెంపకం, ఖరీఫ్‌లో యాజమాన్య పద్ధతులు, పంటల సాగులో మెలుకువల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రశాంతి, ఫామ్ మేనేజర్ మమత, డాక్టర్ శిల్పకళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శిల్పకళల మాట్లాడుతూ స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, లాభసాటి వ్యవసాయ పద్ధతుల గురించి వివరిస్తూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలనీ రైతులకు తెలిపారు. మామిడి తోటలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు, మామిడి తోటలలో అంతర. పంటలు సాగు చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం కృషి శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మామిడి, వేరుశెనగ పంటలలో సస్య రక్షణ పద్ధతులు అవలంభించడం వలన అధిక దిగుబడులు వస్తాయని వాటి ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ఖరీఫ్ సీజన్ కు సాగుకు అనువైన వేరుశనగ, వరి పంటలు విత్తన రకాల గురుంచి వివరించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి నాగమణి, మండల వ్యవసాయ అధికారిని నాగమణి, గ్రామ ఉద్యాన సహా యకులు మంజుల గ్రామ రైతులు, ప్రజా ప్రతినిధులు, రైతు సేవాకేంద్రం సిబ్బంది, ఆత్మ, పట్టు పరిశ్రమ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


సీతాఫలం పంటను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

నిమ్మనపల్లె: భూసార పరీక్షలతో పంటలకు అవసరమైన ఎరువులను అందించి అధిక దిగుబడులను సాధించవచ్చని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసులు అన్నారు. కొండయ్యగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లె, గుడ్రెడ్డిగారిపల్లెలో ఆయన పర్యటించి రైతులతో సమావేశం నిర్వహించారు. కలికిరి కెవికె సమన్వయకర్త డాక్టర్ కే.మంజుల పర్యవేక్షణలో కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖ వికసిత్ కృషి సంకల్ప యాత్ర అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె డాక్టర్ ఎ.శీనివాసులు మాట్లాడుతూ రైతులు పంటలను సాగు చేసే ముందు భూసార పరీక్షలను చేయించుకొని భూమి సారవంతానికి అవసరమైన ఎరువులను వాడడం వలన సాగు చేసే పంటలు అధిక దిగుబడిని సాధించడానికి దోహదపడుతుందన్నారు. పడమటి మండలాలలో అధికంగా టమోటా పంటలను రైతులు సాగు చేస్తున్నారని భూమి సారవంతాన్ని పరిశీలించి ఎరువులను వాడడం ద్వారా పంట సాగులో నాణ్యతను సాధించవచ్చని, ఆరోగ్యకరమైన పంట దిగుబడిని పొందవచ్చు అన్నారు. ట్రైకోడర్మి విరిడి అనే జీవ శిలీంద్రనాశని ని వాడడం వలన నేల ద్వారా పంటలకు సంక్రమించే వ్యాధులను అరికట్టవచ్చు అన్నారు. కలికిరి ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.స్వరా జ్యలక్ష్మి మాట్లాడుతూ టమాటా, ఇతర ఉద్యానవన పంటలలో డిమాండు లేనప్పుడు అదనంగా విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేసి రైతులు స్వంతంగా మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చు అన్నారు. రైతులు సాగు చేసే పంటలలో బయోఫెర్టిలైజర్‌ను వాడాలని సూచించారు.గుడ్రెడ్డిగారి పల్లెలో రైతు జి.నవీన్ రెడ్డి సాగు చేసిన సీతాఫలం పంటను పరిశీలించి అవలంబించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, సెరికల్చర్ అసిస్టెంట్ రాజశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ మునీంద్ర, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఇంప్రూవ్‌మెంట్‌లో సత్తాచాటిన 'శ్రీమదనపల్లె' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంటర్మీడియట్ ఇంప్రూమెంట్ ఫలితాల్లో శ్రీమదనపల్లె జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎస్.మహేశ్వర్ష రెడ్డి మాట్లాడుతూ శనివారం ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో మొదటి సంవత్సరం ఎంపిసిలో 470 మార్కులకు గాను పి.గంగోత్రి 466 (స్టేట్ సెకండ్), బి.దక్షిత 465, కె.భానుతేజ 465, ఎస్ఎండి సిద్ధిఖ్ 465లతో (స్టేట్ థర్డ్), బి.జయహర్షిత 464 (స్టేట్ ఫోర్త్), పి.సోమశేఖర్463, జి.మౌర్యతేజ 463 మార్కులతో రాష్ట్రస్థాయిలో ఐదోర్యాంకు కైవసం చేసుకున్నారని అన్నారు. అదేవిధంగా బైపీసీలో 440 మార్కులకు గాను కె.అనీషా428, ఎం.పద్మప్రియ428, కె.ఎస్.ప్రియ421 మార్కులు సాధించారన్నారు. సిఇసిలో 500 మార్కులకు కె.రెడ్డి భాను 460 సాధించి సత్తాచాటారని తెలిపారు. 95 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉందన్నారు. ప్రతి ఏడాది తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి ర్యాంకులు సాధిస్తున్నారని ఇందుకు ద్వితీయ సంవత్సరం ఎంఇసిలో 1000 మార్కులకుగాను జి.యక్షిత 979 మార్కులు సాధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభ అవార్డుకు ఎంపిక కావడమే నిదర్శమన్నారు. విద్యార్థుల కఠోర శ్రమ, అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం కళాశాలలో అడ్మిషన్లు జరుగుతు న్నాయని పదవ తరగతి-2025 ఫలితాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను మా కళాశాలలో చేర్పించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.


భోజనాన్ని వడ్డిస్తున్న సర్పంచ్ జంబు సూర్యనారాయణ

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-నందలూరు

నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీలో మారమ్మ ఆలయంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మారమ్మ జాతర మహోత్సవంలో భాగంగా శనివారం ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నాగిరెడ్డిపల్లి సర్పంచ్ జంబు సూర్యనారాయణ ప్రారంభించారు. ప్రత్యేక పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జాతర మొత్వాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని అన్నారు. పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. అన్నదానం గొప్పదని ప్రతియేటా ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు దుర్గారెడ్డి, ధనుంజయ నాయుడు, గోపాల్, అరిగే హరిబాబు, నారాయణ, మహేష్, పవన్ కుమార్, దండు నాగేశ్వరరావు, సుబ్బ నరసయ్య పాల్గొన్నారు.

నేడు కడప డిఇఒ కార్యాలయం ముట్టడి

- వెబ్ కౌన్సెలింగ్ వద్దు

ప్రజాశక్తి-పుల్లంపేట

స్థానిక ఎంఆర్‌సిలో శనివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయ కులు సమావేశమయ్యారు. సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులకు మాన్యువల్ పద్ధతిలో బదిలీలు నిర్వహిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అకస్మాత్తుగా వెబ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు జరపడానికి ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో ఆప్షన్స్ పెట్టుకోమని ఉత్తర్వులు జారీ చేయడాని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆదివారం ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో కడప డిఇఒ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మాన్యువల్ ద్వారా బదిలీలు సాధించు కున్నామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు పుల్లంపేట మండల పిఆర్‌టియు అధ్యక్షులు సుబ్బారావు, ఎస్‌టియు అధ్యక్షులు సర్దార్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, జిల్లా కార్యదర్శి హరినాథ్, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా కార్యదర్శి రమణమూర్తి, శ్రీనివాసులు శివరాం, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు

క్రైం కార్నర్

భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భవననిర్మాణ కార్మికుడు కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం వెలుగు చూసింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కురబలకోట మండలం, స్థానిక అమ్మచెరువుమిట్టలోని బండమీద కాలనీకి చెందిన రామకృష్ణ, శకుంతల దంపతుల కుమారుడు గంగాధర్(23) తన చిన్నమ్మ కన్యాకుమారి వద్ద ఉంటూ భవన నిర్మాణ పనులు చేసుకుంటున్నాడు. గత కొంత కాలంగా తనకు వివాహం చేయాలని కుటుంబ సభ్యులను కోరుతున్నాడు. అతనికి అనారోగ్యం ఉన్న కారణంగా కుటుంబ సభ్యులు ఆ కార్యాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. అయితే తీవ్ర మనస్థాపానికి గురైన గంగాధర్ వాస్మల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని వెంటనే మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో కోలార్‌కు రెఫర్ చేశారు. కోలార్‌కు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గంగాధర్(ఫైల్ ఫొటో)

అనారోగ్యంతో మరో వృద్ధురాలు..

మదనపల్లె అర్బన్ :అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శనివారం వాల్మీకిపురం మండలంలో చోటుచేసుకుంది. వాల్మీకిపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని విఠలం గ్రామానికి చెందిన నరసింహులు భార్య యల్లమ్మ(65) గత కొంత కాలంగా అల్సర్, కేన్సర్‌తో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు ఆమెకు పలు ఆస్పత్రులలో చికిత్స చేయించారు. అయినా జబ్బు నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యల్లమ్మ విషపూరితమైన గన్నేరు పప్పు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. వాల్మీకిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా : తొమ్మిది మందికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆటో బోల్తా పడిన ఘటనలో 9 మంది గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం మదనపల్లె రూరల్ మండలం పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ఆరోగ్యవరం సమీపంలోని తురకపల్లికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు రుకియా సైపున్నిషా, హమీద, నదీర్‌షా, సుల్తాని ఆసియా మదనపల్లెకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి స్వగ్రామం తురకపల్లికి బయలుదేరెందుకు షేర్ ఆటోను ఎక్కారు. వీరితో పాటు అదే ప్రాంతానికి చెందిన మరియ, యూసఫ్ ఆటో ఎక్కారు. మార్గమధ్యంలోని ఎర్రగానిమిట్ట వద్ద టిడ్కో ఇళ్ళ మలుపులో ఎదురుగా ట్రాక్టర్ వేగంగా దూసుకురావడంతో తప్పించుకునే క్రమంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ చంద్రశేఖర్ తో పాటు ఆటోలో ఉన్న ఎనిమిది మంది గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్సలు అందించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందెంరాయుళ్లపై కేసు నమోదు

ప్రజాశక్తి - రామసముద్రం

కోడిపందెం స్థావరాలపై దాడులు చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని కాప్పల్లి పంచాయతీ పోతు రాజుపల్లి గ్రామ సమీపంలో కొందరు వ్యక్తులు కోడిపందేలు అడుతున్నట్లు సమాచారం రావడంతో రామసముద్రం పోలీసులు కోడి పందెం స్థావరాలపై దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకుని వారివద్ద నున్న రూ.2030లు నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.